సాక్షి ఖమ్మం

మంగళవారం। 24। జూన్। 2025



ఒలింపిక్స్ స్థాయికి ఎదగాలి

జిల్లా క్రీడాకారులు నిరంతర సాధనతో ఒలింపిక్స్‌లో పోటీ పడే స్థాయికి ఎదగాలని అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి సూచించారు. 8లో



ఏదులాపురం.. ఎప్పడూ అంతే

ఏదులాపురం పీఏసీఎస్ గత చైర్మన్‌పై అక్రమాల నేపథ్యాన చర్యలు తీసుకోగా, ప్రస్తుత చైర్మన్‌పైనా అలాంటి ఫిర్యాదులే అందడం గమనార్హం. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
34° / 26°

వాతావరణం

జిల్లాలో మంగళవారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. కొన్ని ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

నేడు రైతులతో సీఎం ముఖాముఖి

ఖమ్మంవ్యవసాయం: రైతు భరోసా అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడనున్నారు. హైదరాబాద్‌లోని సెక్రటరియేట్ నుంచి సాయంత్రం 5గంటలకు సీఎం మాట్లాడనుండగా, రైతువేదికల ద్వారా రైతులు హాజరుకావాల్సి ఉంటుంది. ఈమేరకు జిల్లాలోని 62రైతు వేదికల్లో ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య తెలిపారు. సోమవారం నాటికి 15ఎకరాల సాగు భూమి కలిగిన రైతులకు ఎకరాకు రూ.6 వేల చొప్పున పెట్టుబడి సాయంగా జమ చేసిన నేపథ్యాన రైతుల అభిప్రాయాలను ముఖ్యమంత్రి తెలుసుకుంటారని పేర్కొన్నారు. అలాగే, రైతు భరోసా విజయోత్సవాలు రైతు వేదికల్లో నిర్వహించే అవకాశముంది.

మహిళలకు డ్రోన్ల నిర్వహణపై శిక్షణ

ఖమ్మంఅర్బన్: డ్రోన్ల వినియోగాన్ని ప్రోత్సహించేలా పదో తరగతి విద్యార్హత కలిగిన మహిళలకు శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మహిళా ప్రాంగణం మేనేజర్ వేల్పుల విజేత తెలిపారు. వ్యవసాయ రంగంలో పురుగుల మందుల పిచికారీకి డ్రోన్ల వినియోగం పెరుగుతున్నందున నిరుద్యోగుల అభ్యర్థనతో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. డ్వాక్రా గ్రూపుల్లో సభ్యత్వం కలిగిన వారు శిక్షణ తీసుకుంటే, డ్రోన్లు సబ్సిడీపై అందిస్తారని, వీరికి వ్యవసాయ, ఉద్యానశాఖల పరిధిలో ఉద్యోగావకాశాలు వచ్చే అవకాశముందని తెలిపారు. ఆసక్తి ఉన్న మహిళలు టేకులపల్లిలోని మహిళా ప్రాంగణంలో ఈనెల 28వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని, వివరాలకు 76600 22512 నంబర్‌లో సంప్రదించాలని మేనేజర్ సూచించారు.

అధ్యాపకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలోని మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులను ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి బి.పురందర్ తెలిపారు. జూనియర్ లెక్చరర్ పోస్టుల్లో గణితం, కామర్స్ ఒక్కొక్కటి, పీజీటీ, టీజీటీ ఇంగ్లిష్ ఒక్కొక్కటి (మహిళలకు మాత్రమే) ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు. టెట్ అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తులను కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో ఈనెల 26వ తేదీలోగా అందజేయాలని సూచించారు.

రైతు భరోసా ద్వారా రూ.406.36 కోట్లు జమ

ఖమ్మంవ్యవసాయం: వానాకాలం పెట్టుబడి సాయంగా రైతు భరోసా పథకం ద్వారా రాష్ట్రప్రభుత్వం సోమవారం నాటికి 15 ఎకరాల వరకు భూమి కలిగిన రైతుల ఖాతాల్లో నగదు చేసింది. ఇందులో భాగంగా జిల్లాలోని 3,31,397 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ. 406,36,62,570 జమ అయ్యాయి. జిల్లాలో సాగు భూమి కలిగిన రైతులు 3,53,794 మంది ఉండగా, వీరికి రైతు భరోసా ద్వారా రూ.436,84,65,365 జమ చేయాల్సి ఉంది. ఇందులో ఇప్పటి వరకు దశల వారీగా 15ఎకరాల భూమి కలిగిన రైతులకు నగదు జమ చేశారు.

195 విద్యుత్ ఫిర్యాదుల పరిష్కారం

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ ప్రజావాణిలో ఇప్పటి వరకు 212 ఫిర్యాదులు అందగా, అందులో 195 పరిష్కరించామని ఖమ్మం ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి తెలిపారు. బిల్లులు, మీటర్లలో సమస్యలు, విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు, కేటగిరీ, పేరు మార్పు, ప్రమాదకరంగా స్తంభాలను సరిచేయడం తదితర అంశాలపై ప్రజావాణికి ఫిర్యాదులు అందుతాయని పేర్కొన్నారు. విద్యుత్ కార్యాలయాల్లో ప్రతీ సోమవారం ఉదయం 10నుంచి ఒంటి గంట వరకు, సర్కిల్ కార్యాలయంలో మధ్యాహ్నం 3నుంచి 5గంటల వరకు కొనసాగే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఈ సూచించారు.

పోటీల పోస్టర్లు ఆవిష్కరణ

ఖమ్మం సహకారనగర్: నేషనల్ స్టూడెంట్స్ పర్యావరణ పోటీ(ఎన్ఎస్‌పీసీ) పోస్టర్లను అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణ మార్పులతోఎదురయ్యే పర్యవసానాలు, రక్షణపై విద్యార్థుల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఇందులో భాగంగా పోటీల్లో ఎక్కువ మంది పాల్గొనేలా చూడాలని తెలిపారు. దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న పోటీల్లో పాల్గొనేందుకు ఎలాంటి రిజిస్ట్రేషన్ ఫీజు ఉండదని, జూలై 1 నుండి ఆగస్టు 21 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. Ec-oMitram App ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాని, హిందీ, ఇంగ్లిష్ తదితర భాషల్లో క్విజ్ ఉంటుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో డీఈఓ సామినేని సత్యనారాయణ, జిల్లా సైన్స్ అధికారి జగదీశ్వర్, అధికారులు రాజశేఖర్, రామకృష్ణ, తులసి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం బోనస్.. మైనస్



యాసంగి సీజన్ నగదు జమ కాక ఎదురుచూపులు

- జిల్లా రైతాంగానికి రూ.63.53 కోట్ల బకాయి
- ఎప్పుడు జమ అవుతుందోనని నిరీక్షణ

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: గడిచిన యాసంగి సీజన్‌లో సన్న ధాన్యం సాగు చేసి ప్రభుత్వ కేంద్రాల్లో విక్రయించిన రైతులు బోనస్ కోసం ఎదురుచూస్తున్నారు. ధాన్యం సేకరణ పూర్తయి, కేంద్రాలు మూసివేసినా బోనస్ రాకపోవడం వారిని ఆందోళనకు గురిచేస్తోంది. సీజన్‌లో 18,855మంది రైతులు 12,70,653 క్వింటాళ్ల సన్న ధాన్యాన్ని అనేక సమస్యల నడుమ విక్రయించారు. మద్దతు ధరకు తోడు బోనస్ వస్తుందని ఆశిస్తే ప్రభుత్వం ఇప్పటివరకు విడుదల చేయలేదు. జిల్లా రైతులకు రూ.63,53,26,800 చెల్లించాల్సి ఉండగా, ఇప్పుడైనా విడుదల చేస్తే వానాకాలం పంటల సాగు అవసరాలకు ఉపయోగపడుతుందని నిరీక్షిస్తున్నారు.

బోనస్‌తో పెరిగిన సాగు

రాష్ట్ర ప్రభుత్వం సన్నధాన్యానికి మద్దతు ధరతో పాటు క్వింటాకు రూ.500 బోనస్ చెల్లిస్తామన్న ప్రకటనతో రైతులు యాసంగిలో సన్న రకాలే ఎక్కువగా సాగు చేశారు. సహజంగా యాసంగిలో ఆరుతడి పంటల సాగు చేయాలని వ్యవసాయ అధికారులు సూచిస్తుండగా, రైతులు తక్కువ విస్తీర్ణంలో వరి సాగు చేస్తారు. కానీ బోనస్ ప్రకటనకు తోడు నాగార్జునసాగర్ ఆయకట్టుతో పాటు నాన్ ఆయకట్టులోని బోర్లు, బావుల కింద 2,10,830 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇందులో సన్న రకాలే 1,29,064 ఎకరాల్లో సాగవయ్యాయి.

12.70 లక్షల క్వింటాళ్ల సేకరణ

యాసంగిలో ఈసారి సన్న రకం, దొడ్డు రకం కలిపి 54,51,516 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. మిల్లర్లు, ప్రైవేట్ వ్యాపారుల కొనుగోళ్లు, రైతుల అవసరాలు పోగా 25,84,928 క్వింటాళ్ల సన్న, దొడ్డు ధాన్యం సేకరణను లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో సన్న రకాలు 18,53,370 క్వింటాళ్లు ఉండగా.. 18,855 మంది రైతుల నుంచి 12,70,653.60 క్వింటాళ్ల ధాన్యాన్ని పౌర సరఫరాల సంస్థ సేకరించింది.

ఆసరా అవుతుందని..

కష్టనష్టాల నడుమ సన్న రకాలు సేద్యం చేయగా, ధాన్యం విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాల్లో అవస్థ పడ్డారు. అయినా రూ.500 బోనస్ వస్తుందని భావిస్తే నెలలు గడుస్తున్నా జమ కాకపోవడంతో రైతుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. బోనస్ విషయమై విస్తృత ప్రచారం చేసిన ప్రభుత్వం అమ్మకాలు పూర్తికాగానే జమ చేస్తామని వెల్లడించింది. అయినా జిల్లా రైతులకు రూ.63,53,26,800 అందకపోగా, వానాలం సీజన్ ప్రారంభమైన తరుణాన స్పందించాలని కోరుతూ ప్రతిరోజు బ్యాంకు ఖాతాల్లో బ్యాలెన్స్ చూసుకోవడం పరిపాటిగా మారింది.

ఏప్రిల్‌లో అమ్మినా...



ఈ రైతు నేలకొండపల్లి మండలం భైరవునిపల్లికి చెందిన మరికంటి శంకర్. రబీలో సన్నధాన్యం సాగు చేసిన ఈయన నేలకొండపల్లి మార్కెట్‌లో 150 క్వింటాళ్ల ధాన్యం అమ్మాడు. గత ఏప్రిల్‌లో విక్రయించగా మే నెలలో ధాన్యానికి సంబంధించి నగదు ఖాతాలో జమ అయింది. కానీ బోనస్ మాత్రం ఇప్పటివరకు రాలేదు. వానా కాలం సాగు పనులు సాగుతున్నందున ఇప్పటికైనా బోనస్ చెల్లిస్తే పెట్టుబడికి ఉపయోగపడుతుందని ఎదురుచూస్తున్నాడు.

అష్టకష్టాల నడుమ...

సన్నధాన్యం విక్రయం సందర్భంగా రైతులు కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాంటాలు ఆలస్యమవుతుండడంతో రోజుల తరబడి పడిగాపులు కాశారు. ఇక తేమ శాతం పేరుతో క్వింటాకు 3 – 5 కేజీల వరకు తరుగు తీస్తామని మిల్లర్లు చెప్పగా, కాంటా పూర్తయ్యాక లారీలు అందుబాటులో లేక ఎదురు చూడాల్సి వచ్చింది. అదే సమయాన అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోవడంతో మళ్లీ ఆరబెట్టారు. ఇలా అనేక అవాంతరాలు ఎదురైనా క్వింటాకు రూ.500 బోనస్ వస్తుందనే ఆశలతో ప్రభుత్వ కేంద్రాల్లోనే ఎక్కువ మంది ధాన్యం విక్రయించారు. కొందరు మాత్రమే ఈ ఇబ్బందులు భరించలేక ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించారు.

జిల్లాలో అత్యధికంగా బోనస్ కావాల్సిన మండలాల వివరాలు...

మండలం	రైతులు	ధాన్యం (క్వింటాళ్లలో)	రావాల్సిన నగదు
నేలకొండపల్లి	3,450	2,39,889.60	రూ.11,99,44,800
తల్లాడ	1,888	2,32,940	రూ.11,64,70,000
కూసుమంచి	2,201	1,38,829.60	రూ.6,94,14,800
కల్లూరు	1,305	1,29,354.00	రూ.6,46,77,000
ముదిగొండ	1,979	1,00,090.80	రూ.5,00,45,400
వేంసూరు	1,410	74,749.60	రూ.3,73,74,800
పెనుబల్లి	1,052	67,555.60	రూ.3,37,77,800
తిరుమలాయపాలెం	1,282	66,666.40	రూ.3,33,33,200
సత్తుపల్లి	1,050	62,449.60	రూ.3,12,24,800
ఖమ్మంరూరల్	983	40,340.40	రూ.2,01,70,200

ప్రజావాణికి బారులు...



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ అనుదీప్, అదనపు కలెకర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి



ఫిర్యాదులు ఇచ్చేందుకు బారులుదీరిన జనం

- కొన్ని సమస్యలపై పదేపదే ఫిర్యాదులు
- అయినా పరిష్కారం కాక ఆవేదన

ఖమ్మం సహకారనగర్: సమస్యలపై ఫిర్యాదులు, ప్రభుత్వ పథకాల కోసం వినతిపత్రాలు స్వీకరించేందుకు ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే గ్రీవెన్స్ డే(ప్రజావాణి)కు జనం పోటెత్తుతున్నారు. మండల స్థాయిలో కూడా ప్రజావాణి నిర్వహిస్తున్నా జిల్లా కేంద్రంలోనైతే కలెక్టర్ దృష్టికి నేరుగా సమస్యను తీసుకెళ్లవచ్చని భావిస్తుండడం ఇందుకు కారణంగా తెలుస్తోంది. దీంతో వారం వారం ఇక్కడ ఫిర్యాదులు, వినతుల సంఖ్య పెరుగుతోంది. అయితే, ఇందులోనూ చాలా మంది రెండు, మూడు సార్లు విన్నవించినా పరిష్కారం కాక అదే సమస్యపై మళ్లీమళ్లీ ఫిర్యాదులు ఇస్తుండడం గమనార్హం.

ప్రజావాణి ఇలా...

కలెక్టర్‌గా అనుదీప్ దురిశెట్టి బాధ్యతలు స్వీకరించాక గత సోమవారం తొలిసారి ప్రజావాణికి హాజరయ్యారు. ఈక్రమంలో ఆయన ఫిర్యాదుల ఆన్‌లైన్, పరిష్కారంపై అధికారులకు సూచనలు చేశారు. మండల స్థాయిలో సమస్యల పరిష్కారంపై జిల్లా అధికారులు సమీక్షించాలని తెలిపారు. ఏవైనా సమస్యలు పరిష్కరించలేకపోతే అందుకు కారణాలను వివరించాలని సూచించారు. అంతేకాక ప్రతీ సోమవారం ప్రజావాణికి ముందు గత వారం ఫిర్యాదులపై సమీక్షించాలని ఆదేశించారు. దీంతో ఈ వారం అధికారులు సమీక్షించి పెండింగ్ దరఖాస్తులపై ఆరా తీశారు. ఇక సోమవారం సైతం గ్రీవెన్స్ డేకు హాజరైన కలెక్టర్ అనుదీప్.. అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డితో కలిసి ఫిర్యాదులు స్వీకరించారు. డీఆర్వో పద్మశ్రీ, డీఆర్‌డీఓ సన్యాసయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు కొన్ని..

- ఖమ్మం పంపింగ్ వెల్ రోడ్డులో కొప్పు ప్రభావతి, కొప్పు పద్మావతి, కొప్పు సంపత్‌కుమార్‌కు 4,716 చదరపు గజాల స్థలం ఉండగా, అందులో 616 గజాల్లో నగరపాలక సంస్థ అధికారులు పార్క్ నిర్మించారని ఫిర్యాదు చేశారు. తమ భూములు తిరిగి ఇప్పించాలని కోరారు.
- చింతకానికి చెందిన దివ్యాంగుడు పి.జగన్నాథం సదరం సర్టిఫికెట్ మంజూరు చేయాలని కోరారు.
- వువ్వాడ ఉదయ్‌నగర్ కాలనీ గ్రామకార్యదర్శి అక్రమాలకు పాల్పడుతుండగా, గతంలోనూ ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని వీర నారీమణుల ఆశయసాధన సమితి బాధ్యులు తెలిపారు. ఆయనను బదిలీ చేయాలని వినతిపత్రం అందజేశారు.

రెండు గదుల్లో ఏడుగురం..



నేను కూలీ పనులతో జీవనం సాగిస్తున్నా. రెండు గదులు ఉన్న అత్త గారింట్లో ఉంటుండగా... ఇందిరమ్మ ఇంటి పథకంలో నన్ను ఎల్–3 కింద చేర్చారు. రెండు గదుల్లో ఏడుగురు ఉంటూ ఇబ్బంది పడుతున్నందున మొదటి విడతలో ఇల్లు మంజూరు చేయాలి.

– రేగళ్ల నాగమణి, తాటిపుడి, వైరా మండలం

స్థలం ఆక్రమణ, అమ్మకం



వారసత్వంగా నాకు, నా సోదరుడికి ఆరు కుంటల ఇంటి స్థలం రావాల్సి ఉంది. కానీ ఇంకో సోదరుడు, ప్రభుత్వ ఉద్యోగి హలావత్ వెంకన్న మమ్మల్ని బెదిరించి స్థలాన్ని ఇతరులకు అమ్మాడు. అధికారులు విచారణ చేపట్టి న్యాయం చేయాలి.

– హలావత్ సీత్లా, రత్యా, కోక్యాతండా

నా భూమి ఇప్పించండి



చింతకాని మండలం అనంతసాగర్‌లో ఎనిమిది కుంటల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమి 277 సర్వేనంబర్‌లో ఉంటే, 278గా చెబుతూ సైదులు ఖమ్మంకు చెందిన శ్రీనివాసరావుకు విక్రయించాడు. అధికారులు పరిశీలించి భూమి ఇప్పించాలి.

– పాశం సైదులు, రామకృష్ణాపురం

ప్రణాళికాయుతంగా భూసేకరణ

ఖమ్మం అర్బన్: మున్నేరు నది కిరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మిస్తుండగా, అవసరమైన భూసేకరణను ప్రణాళికాయుతంగా పూర్తిచేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి రిటైనింగ్‌వాల్ నిర్మాణ పనుల పురోగతి, భూసేకరణపై సమీక్షించారు. మున్నేటికి ఇరువైపులా ఎనిమిదిన్నర కిలోమీటర్ల చొప్పున 17 కి.మీ. మేర రిటైనింగ్ వాల్ నిర్మాణానికి 245 ఎకరాల భూమి అవసరమని తెలిపారు. ఇందులో ప్రభుత్వ భూమిలో పనులు కొనసాగుతుండగా, అవసరమైన ప్రైవేట్ భూములను కూడా సేకరించాలని సూచించారు. అలాగే, ప్రకాష్‌నగర్ చెక్‌డ్యాం తొలగింపునకు చేసిన ప్రతిపాదనలు, సీతారామ ఎత్తిపోతల పథకం కాల్వలు, జాతీయ రహదారుల నిర్మాణానికి అవసరమైన భూ సేకరణపై చర్చించారు. ఆర్డీఓలు నర్సింహారావు, రాజేంద్రగౌడ్, నేషనల్ హైవే పీడీ రామాంజనేయరెడ్డి, మేనేజర్ దివ్య, ఇరిగేషన్ డీఈ రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

అందుబాటులో బృందాలు

ఖమ్మం సహకారనగర్: రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో వరద విపత్తుల నిర్వహణ కోసం ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలను ముందస్తుగా సిద్ధం చేసినట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో గత ఏడాది వచ్చిన భారీ వరదల దృష్ట్యా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా జిల్లా కేంద్రంలో 24మంది సభ్యులతో కూడిన ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం, 24 సభ్యులతో కూడిన ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలను సమాయత్తం చేశామని, వీరికి అవసరమైన అన్ని రకాల సామగ్రి అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. తద్వారా రానున్న రోజుల్లో ఎటువంటి పరిస్థితులు వచ్చినా ఎదుర్కొనేందుకు పూర్తి సన్నద్ధంగా ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు.

ముత్తంగి అలంకరణలో భద్రాచల రామయ్య

భద్రాచలం: భద్రాచలంలో శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంలోని మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామునే గర్భగుడిలో స్వామికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీరిన స్వామికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. ఆతర్వాత స్వామి, అమ్మవార్లకు కంకణధారణ చేశాక నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు జరిపారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

పోలీసు కమిషనర్ సునీల్‌దత్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీపీ సునీల్‌దత్, పక్కన అధికారులు

ఖమ్మంక్రైం: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, తద్వారా మంచి భవిష్యత్ ఏర్పర్చుకోవచ్చని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. మాదక ద్రవ్యాల వినియోగం, రవాణాకు వ్యతిరేకంగా ఖమ్మం రిక్కాబజార్ పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిగరెట్లు, గంజాయి, మద్యం వంటివి సరదాగా మొదలైనా ఆ తర్వాత వాటికి బానిసలైతే జీవితాన్ని కోల్పోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అంతేకాక మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే సమాజం ఎదుట దోషిగా నిలబడాల్సి వస్తుందని చెప్పారు. ఈమేరకు మాదక ద్రవ్యాలను నిర్మూలించడంలో విద్యార్థులు, యువత భాగస్వామ్యం కావాలని సూచించారు. ఎక్కడైన గంజాయి, డ్రగ్స్ వంటి వినియోగం, అమ్మకాల సమాచారం తెలిస్తే 1908, 100 నంబర్లకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అనంతరం పాఠశాల ఆవరణలో సీపీ మొక్కలు నాటారు. ఈకార్యక్రమంలో నగర ఏసీపీ రమణమూర్తి, సీఐ బాలకృష్ణ, ఎంఈఓ శైలజలక్ష్మి, హెచ్‌ఎం విశ్రాంత, ఉపాధ్యాయులు కట్టా శేఖర్‌రావు, సుజాత, ఉమాదేవి, పోలీసు ఉద్యోగులు పాల్గొన్నారు.


చిరు వ్యాపారులతో సంఘాలు

- కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో కొత్త సీఐజీల ఏర్పాటు
- మెప్మా ఆధ్వర్యాన సంఘాల నిర్మాణం

ఖమ్మంమయూరిసెంటర్: పట్టణ పేదల జీవనోపాధిని మెరుగుపర్చడమే లక్ష్యంగా మెప్మా తమ 100 రోజుల ప్రణాళికలో భాగంగా వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వీధి వ్యాపారుల కోసం కామన్ ఇంట్రెస్ట్ గ్రూపులు (సీఐజీ) ఏర్పాటు చేయించడం ఈ కార్యక్రమ లక్ష్యంగా చెబుతున్నారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ పరిధిలో చిరు వ్యాపారాలు నిర్వహించుకునే వీధి వ్యాపారులకు సంఘాల ఏర్పాటుతో వారి జీవితాల్లో మార్పులు వస్తాయని, ఆర్థిక స్వావలంబనకు మార్గం ఏర్పడుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈమేరకు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు మధిర, సత్తుపల్లి, వైరా మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 284 సీఐజీల ఏర్పాటును ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించగా ఇప్పటి వరకు 57 గ్రూప్‌లను ఏర్పాటు చేశారు.

పదేసి మందితో...

ఒకే రకమైన వ్యాపారం చేసేవారు లేదా ఒకే ప్రాంతంలో వ్యాపారం చేసే వీధి వ్యాపారులను కలిపి గ్రూప్‌గా ఏర్పాటు చేస్తారు. కూరగాయలు, పండ్లు, చిరుతిళ్లు, వస్త్రాలు ఇలా ఒకే కేటగిరీకి చెందిన వారు, ఒకే వీధిలో తోపుడు బండ్లు, చిన్న బడ్డీ కొట్ల ద్వారా వ్యాపారం చేసేవారిపై దృష్టి సారించారు. ఒక్కో గ్రూప్‌లో ఐదు నుంచి 10 మంది సభ్యులు ఉండేలా చూస్తున్నారు.



సీఐజీ ఏర్పాటుకు చిరు వ్యాపారుల వివరాలు నమోదు చేస్తున్న మెప్మా సిబ్బంది

ఆర్థిక సాయం..

వీధి వ్యాపారులతో సీఐజీలను ఏర్పాటుచేశాక మెప్మా ఆధ్వర్యాన బ్యాంక్ లింకేజీ రుణాలు ఇప్పించే వీలుంటుంది. వీధి వ్యాపారులు వ్యక్తిగత రుణం తీసుకోవడానికి ఇబ్బందులు ఎదురవుతాయి. ఈ నేపథ్యాన సంఘంగా ఏర్పడితే బ్యాంకుల నుండి లింకేజీ రుణాలు సులువుగా మంజూరు కానున్నాయి. ఒక్కో గ్రూప్‌కు రూ.లక్ష వరకు రుణం మంజూరయ్యే అవకాశమున్నందున వ్యాపార విస్తరణకు ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. అంతేకాక సీఐజీలు ఏర్పడ్డాక వీధి వ్యాపారులకు వ్యాపార నైపుణ్యాలు, కొత్త పద్ధతులపై శిక్షణ ఇప్పిస్తారు. అలాగే, ఒకే రకమైన సమస్య ఎదుర్కొంటున్న వ్యక్తులు గ్రూప్‌గా ఏర్పడడం ద్వారా మానసిక మద్దతు ఇచ్చిపుచ్చుకుంటారని.. వారి సమస్యలపై చర్చించుకుని పరిష్కరించుకునేలా వీలు ఏర్పడుతుందని అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో సీఐజీల లక్ష్యం, ఏర్పాటు

స్థానిక సంస్థ	సీఐజీల లక్ష్యం	ఏర్పాటైన సీఐజీలు
ఖమ్మం కార్పొరేషన్	218	30
మధిర	23	08
సత్తుపల్లి	22	09
వైరా	21	10

క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన ఉద్యోగ సంఘాల బాధ్యులు


కలెక్టర్‌ను సన్మానిస్తున్న ప్రతినిధులు

ఖమ్మం సహకారనగర్: కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అనుదీప్ దురిశెట్టిని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు ఆధ్వర్యాన టీజీవోస్, టీఎన్జీవోస్ బాధ్యులు కలిశారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసిన వారు సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీజీఏసీ జిల్లా చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి కొణిదన శ్రీనివాస్, టీజీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కస్తాల సత్యనారాయణ, మోదుగు వేలాద్రి తదితరులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ ఉపాధ్యాయ ప్రధాన సంపాదకులుగా నాగిరెడ్డి


పి.నాగిరెడ్డి

ఖమ్మం సహకారనగర్: టీపీటీఎఫ్ వెలువరించే ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులుగా పి.నాగిరెడ్డి ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. గతంలో నాగిరెడ్డి టీపీటీఎఫ్ మండల, జిల్లా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఈసందర్భంగా ఆయనకు టీపీటీఎఫ్ నాయకులు మనోహర్‌రాజు, రామారావు, ఎస్.విజయ్ అభినందనలు తెలిపారు.

ఐఎఫ్‌ఎస్‌గా ఎంపికైన యువకుడికి సన్మానం


చరణ్‌తేజ్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వైరారూరల్: మండలంలోని రెబ్బవరం గ్రామానికి చెందిన చరణ్‌తేజ ఇటీవల విడుదలైన యూపీఎస్‌సీ సివిల్ సర్వీస్ పరీక్షల్లో 231 ర్యాంకు సాధించి ఐఎఫ్‌ఎస్‌గా ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ఆయనను సోమవారం గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉపాధ్యాయులు, స్థానికులు సన్మానించారు. అనంతరం చరణ్‌తేజ్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని దాన్ని సాధించేలా శ్రమించాలని సూచించారు. ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జ్ హెచ్ఎం గంగవరపు వెంకట్రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పబ్లిక్ స్కూళ్ల పేరుతో విలీనం సరికాదు

ఎర్రుపాలెం: పబ్లిక్ స్కూళ్లు ఏర్పాటుచేస్తామంటూ ఉన్న పాఠశాలలను విలీనం చేయడం గర్హనీయమని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రంగారావు పేర్కొన్నారు. విలీనం నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని ప్రభుత్వ పాఠశాలలు బలోపేతమయ్యేలా అభివృద్ధి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం పీఆర్టీయూ సభ్యత నమోదు ప్రచారం చేశారు. ఈసందర్భంగా రంగారావు మాట్లాడుతూ కొత్త పింఛన్ విధానం రద్దు, పెండింగ్ బిల్లుల మంజూరుతో పాటు ఇతర సమస్యల పరిష్కారానికి తమ సంఘం కృషి చేస్తోందని తెలిపారు. పీఆర్టీయూ మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.మదన్‌మోహన్‌రెడ్డి, ఎం.బాబురావుతో పాటు ఆర్.బ్రహ్మారెడ్డి, జంగాగురునాథరెడ్డి, శెట్టిపల్లి సంగిరెడ్డి, డి.లింగయ్య, లక్ష్మారెడ్డి, అప్పిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, వెంకటనారాయణ, నర్సింహారావు, రాఘవరావు, నాగరాజు, రమేష్ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ మొక్కలపై సమగ్ర నివేది

అశ్వారావుపేట: ఉమ్మడి జిల్లాలోని అశ్వారావుపేట, సత్తుపల్లి మండలం రేగళ్లపాడు నర్సరీల ద్వారా రైతులకు పంపిణీ చేసిన ఆయిల్‌పామ్ మొక్కలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని జాతీయ ఎస్టీ కమిషన్ సూచించింది. ఈ రెండు నర్సరీల ద్వారా ఇచ్చిన మొక్కల్లో ఆఫ్‌టైప్ రావడంతో రూ.లక్షల్లో నష్టపోయామని పలువురు రైతులు ఎస్టీ కమిషన్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం హైదరాబాద్‌లో ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ విచారణ చేపట్టారు. ఆయిల్‌ఫెడ్, ఉద్యానశాఖ అధికారులతో పాటు బాధిత రైతులు హాజరవగా 2016 – 2022 మధ్యలో పంపిణీ చేసిన ఆయిల్‌పామ్ మొక్కల ఎదుగుదల, దిగుబడిపై సమగ్ర నివేదిక నెలలోగా అందజేయాలని అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా ఐఐఓపీఆర్ శాస్త్రవేత్తల క్షేత్రస్థాయి సందర్శనకు ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. ఈ విచారణకు ఉద్యానశాఖ కమిషనర్ యాస్మిన్ బాషా, ఆయిల్‌ఫెడ్ ఎండీ శంకరయ్య, ఓఎస్డీ అడప కిరణ్, ప్రవీణ్‌రెడ్డితో పాటు జిల్లా రైతులు కారం శ్రీరాములు, మడివి బాలరాజు, కొంద్రు మురళి, చెలికాని వెంకట్, తుంబూరు ఉమామహేశ్వరరెడ్డి తదితరులు హాజరయ్యారు.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.18,748

వాటాధనం నుంచి వాటా..

- సొసైటీలకు ఆరు శాతం డివిడెంట్‌గా చెల్లించేందుకు నిర్ణయం
- ఫలితంగా రూ.103 కోట్లలో రూ.6 కోట్లు అందే అవకాశం
- రాష్ట్రంలోనే తొలిసారి ఖమ్మం డీసీసీబీలో అమలు



జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ప్రధాన కార్యాలయం

ఖమ్మంవ్యవసాయం: సహకార బ్యాంకుల మనుగడకు మూలమైన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్)ల బలోపేతానికి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) నడుం బిగించింది. సహకార వ్యవస్థలో కీలకమైన పీఏసీఎస్‌లకు రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా వాటాధనంలో కొంత మేర చెల్లించాలని నిర్ణయించింది. సహకార సంఘాల సభ్యులకు డీసీసీబీ నుంచి ఏటా పంట రుణాలు, వ్యవసాయ అనుబంధ రంగాలకు మధ్య కాలిక, దీర్ఘ కాలిక రుణాలను ఇస్తున్నారు. ప్రతీ రుణంలో 10 శాతం వాటాధనాన్ని అప్పులో భాగంగా తమ వద్దే డిపాజిట్ చేస్తారు. ఇందులో నుంచి ఆరు శాతాన్ని డివిడెంట్ రూపంలో పీఏసీఎస్‌లకు అందించాలని డీసీసీబీ పాలకవర్గం తాజాగా నిర్ణయించింది. ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలోని ఖమ్మం జిల్లాలో 75, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 26, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో రెండేసీ పీఏసీఎస్‌లతో పాటు 176 వ్యవసాయేతర పరపతి సంఘాలు ఉన్నాయి. అంతేకాక బ్యాంకు 50 బ్రాంచ్‌లతో రూ.3,600 కోట్ల టర్నోవర్ కలిగి ఉంది. ఏటా సుమారు రూ.1,200 కోట్ల పంట రుణాలు, రూ.900 కోట్లు డిపాజిట్లు కొనసాగుతుండగా, వ్యవసాయ అవసరాలకే కాక బంగారు తాకట్టుపై, గృహ నిర్మాణం, వాహన, విద్య అవసరాలకు కూడా రుణాలు ఇస్తున్నారు.

డివిడెంట్‌గా ఆరు శాతం

సహకార సంఘాల ద్వారా అందించిన పంట రుణాలు, ఇతర మధ్య కాలిక, దీర్ఘ కాలిక రుణాల ద్వారా వాటాధనంగా రూ.103 కోట్ల నిధులు ఉన్నాయి. ఇందులో నుంచి ఆరు శాతం అంటే రూ.6 కోట్ల మేర సహకార సంఘాలకు డివిడెంట్ రూపంలో చెల్లించేలా తీర్మానించారు. ఈ నిధులతో సంఘాలు తిరిగి సంఘ సభ్యులకే లబ్ధి జరిగేలా ఖాతాల్లో అప్పు కింద జమ చేసుకునే అవకాశం ఉంది. లేదంటే దీర్ఘకాలిక అవసరాల కోసం గోదాంలు, కోల్డ్ స్టోరేజీలు నిర్మించే ప్రతిపాదనలు చేసినట్లు సమాచారం.

100 సంఘాలకు ప్రయోజనం

వాటాధనం నుంచి ఆరు శాతం డివిడెంట్ రూపంలో డీసీసీబీ చెల్లిస్తుండగా, బ్యాంకు పరిధిలోని 100 సహకార సంఘాలకు ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది. వాటాధనంగా జమ అయిన మొత్తం రైతులు తీసుకున్న పంట రుణాల ద్వారా సమకూరగా, ఆ వాటాధనం రైతులదే కావడంతో అన్నదాతలతో పాటు సహకార సంఘాలకు ప్రయోజనం కలిగేలా డీసీసీబీ పాలక వర్గం డివిడెంట్ చెల్లింపునకు నిర్ణయించింది.

తొలిసారి ఇక్కడే..

రాష్ట్రంలో తొమ్మిది డీసీసీబీలు ఉండగా, ఖమ్మం డీసీసీబీ మాత్రమే వాటాధనంలో ఆరు శాతాన్ని సహకార సంఘాలకు డివిడెంట్‌గా చెల్లించాలని నిర్ణయించడం విశేషం. 105 ఏళ్ల చరిత్ర కలిగిన డీసీసీబీ అనేక సంస్కరణలను తీసుకురాగా, ఒడిదుడుకులు, లాభ నష్టాలను అధిగమిస్తూ రైతులు, ఇతర వర్గాలకు అండగా నిలుస్తోంది. 2023 – 24 నుంచి బ్యాంకు లాభాల్లో పయనిస్తుండగా, 2024 – 25 ఆర్థిక సంవత్సరంలో రూ.9.64 కోట్ల లాభాలు గడించింది. ఈ నేపథ్యాన బ్యాంకు మనుగడకు మూలమైన పీఏసీఎస్‌లకు ప్రయోజనం కలిగేలా వాటాధనం చెల్లింపునకు నిర్ణయం తీసుకుంది.

సొసైటీల బలోపేతమే లక్ష్యం



పీఏసీఎస్‌ల బలోపేతమే లక్ష్యంగా సంస్కరణలు అమలు చేస్తున్నాం. బ్యాంకు ఎదుగుదలకు కీలకమైన పీఏసీఎస్‌ల నుంచి రైతులు తీసుకున్న రుణాల్లో వాటాధనం సేకరిస్తున్నాం. అందులో నుంచి ఆరు శాతం డివిడెంట్‌గా సంఘాలకు చెల్లించేందుకు పాలకవర్గం నిర్ణయించింది.

–ఎస్.వెంకటఆదిత్య, సీఈఓ, డీసీసీబీ

క్రీడాకారులు ఒలింపిక్స్ స్థాయికి ఎదగాలి

ఒలింపిక్ రన్‌లో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి


ఒలింపిక్ టార్చ్‌తో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు, క్రీడా సంఘాల బాధ్యులు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా క్రీడాకారులు ఒలింపిక్ స్థాయికి ఎదిగి సత్తా చాటాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి సూచించారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియం వద్ద ఒలింపిక్ డే రన్‌ను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ నిరంతర శిక్షణ ద్వారా ప్రతిభ కనబర్చాలని తెలిపారు. అనంతరం డీవైఎస్ఓ టి.సునీల్‌రెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పుట్టా శంకరయ్య మాట్లాడారు. కాగా, పటేల్ స్టేడియం వద్ద మొదలై ఇల్లెందు క్రాస్ రోడ్, కోర్టు, మమత హాస్పిటల్ రోడ్డు మీదుగా లకారం ట్యాంక్ బండ్ వరకు కొనసాగగా పెద్దసంఖ్యలో క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు. డీఐఈఓ రవిబాబు, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.క్రిస్టోఫర్ బాబుతో పాటు క్రీడాసంఘాల ప్రతినిధులు ఎస్.ఉప్పల్‌రెడ్డి, సీహెచ్.రవికుమార్, రఘునందన్, గోవిందరెడ్డి, ఎన్.రాధాకష్ణ, కె.ఆదర్శ్‌కుమార్, వీవీఎస్.మూర్తి, ఎం.డీ.మతిన్, శ్రీనివాస్, ఎం.డీ.గౌస్, సురేష్, పరిపూర్ణాచారి, కొంల్, నగేష్, చంద్రాకాంత్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

నగర వీధుల్లో నెమలి!



ఖమ్మం 15వ డివిజన్ పుట్టకోట వీధుల్లోకి తరచుగా ఓ నెమలి వస్తోంది. పుట్టకోట శివార్లలో ఉన్న వెలుగుమట్ల అటవీ పార్క్ ప్రాంతం నుంచి ఈ నెమలి వస్తోందని భావిస్తున్నారు. ప్రస్తుత వాతావరణంతో పరిస్థితుల్లో పురివిప్పి తిరుగుతున్న నెమలిని స్థానికులు ఆసక్తిగా చూస్తూ సెల్‌ఫోన్ కెమెరాల్లో బంధిస్తున్నారు.

– ఖమ్మం అర్బన్



అదుపు తప్పిన ద్విచక్రవాహనం

ఒకరు మృతి, మరొకరికి గాయాలు


ఎస్.డీ.అమీర్ (ఫైల్)

కారేపల్లి: ద్విచక్రవాహనం అదుపుతప్పగా జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని ఉసిరికాయలపల్లికి చెందిన ఎస్‌డీ.అమీర్(52), భాగ్యనగర్‌తండా గ్రామానికి చెందిన గుగులోతు మంగు సోమవారం మాదారం జరగనున్న సీపీఐ మండల మహాసభ ఏర్పాట్ల పరిశీలనకు ఆదివారం బైక్‌పై వెళ్లారు. ఆ తర్వాత అర్ధరాత్రి దాటాక వారిద్దరు ఉసిరికాయలపల్లి వైపు వస్తుండగా జమాళ్లపల్లి వద్దద్విచక్రవాహనం అదుపుతప్పి పడిపోయింది.ఈ ఘటనలో అమీర్ అక్కడికక్కడే మృతి చెందగా, మంగుకు తీవ్రగాయాలై స్పృహ కోల్పోయాడు. అర్ధరాత్రి కావడంతో ఆ మార్గంలో ఎవరూ వెళ్లకపోవడంతో విషయం వెలుగులోకి రాలేదు. సోమవారం ఉదయం మంగుకు స్పృహ రాగా 108 అంబులెన్స్, పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు చేరుకుని అమీర్ మృతదేహంతో పాటు మంగును ఇల్లెందు ఆస్పత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ తరలించారు. మృతుడు అమీర్ సింగరేణిలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తుండగా, మంగు వ్యవసాయంతో జీవనం సాగిస్తున్నాడు. కాగా, అమీర్ మృతితో సీపీఐ మండల మహాసభను వాయిదా వేయగా, ఆయన మృతదేహం వద్ద సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు. నాయకులు భాగం హేమంతరావు, యత్ర బాబు, ఏపూరి లతాదేవి, శివరామ్, సారయ్య, ఉంగరాల సుధాకర్, ధన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

హోటళ్ల నుంచి 22 సిలిండర్లు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న సిలిండర్లతో ఉద్యోగులు

ఖమ్మంఅర్బన్: జిల్లా కేంద్రంలోని పలు హోటళ్లలో వాణిజ్య సిలిండర్లకు బదులు గృహావసరాల గ్యాస్ సిలిండర్లు వాడుతున్నారనే ఫిర్యాదుతో అధికారులు తనిఖీలు చేపట్టారు. డీసీఎస్ఓ చందన్‌కుమార్ నేతృత్వాన సోమవారం తనిఖీలు చేటప్టగా పలు హోటళ్ల నుంచి 22 గృహ వినియోగ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. ఆయా హోటళ్ల నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. తనిఖీల్లో వివిధ మండలాల డీటీలు మెచ్చు వెంకటేశ్వర్లు, విజయబాబు, నాగలక్ష్మి, ఆర్ఐలు పవన్, నరేష్ పాల్గొన్నారు.

భూమి కాజేసే యత్నం చేస్తున్నారని ఫిర్యాదు

కూసుమంచి: పసుపుకుంకుమ కింద తన తల్లిదండ్రులు ఇచ్చిన వ్యవసాయ భూమిని మరిది కుమారుడు ఫోర్జరీ సంతకంతో కాజేసేందుకు యత్నిస్తున్నాడని ఓ మహిళ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. మండలంలోని జక్కేపల్లికి చెందిన మిడికంటి దమయంతికి 55ఏళ్ల క్రితం ఖమ్మం రూరల్ మండలం గొల్లగూడెంకు చెందిన మిడికంటి అబ్బిరెడ్డితో వివాహం జరిగింది. అప్పట్లో ఆమెకు తల్లిదండ్రులు జక్కేపల్లిలో 3.11 ఎకరాల భూమి ఇచ్చారు. అయితే, తమకు సంతానం లేకపోవడంతో మరిది కుమారుడు మిడికంటి రాజశేఖరరెడ్డి భూమిని ఆయనకు విక్రయించినట్లుగా 2022లో ఫోర్జరీ సంతకంతో డాక్యుమెంట్ రూపొందించాడని తెలిపింది. అంతేకాక భూమి ఆయనేదనని రాజశేఖరరెడ్డి 2025లో కోర్టులో వేయగా విషయం తనకు తెలిసిందని వాపోయింది. వృద్ధాప్యంలో తమను ఇబ్బంది పెడుతున్న రాజశేఖరరెడ్డి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

అమెరికాది యుద్ధోన్మాదం..


సమావేశంలో మాట్లాడుతున్న వీరభద్రం

వైరా: సామ్రాజ్యవాద ఆధిపత్యం కోసమే కాక యుద్ధోన్మాదంతో ఇరాన్‌పై అమెరికా దాడులకు పాల్పడిందని.. ఈ దాడులు అంతర్జాతీయ ఉద్రిక్తతలను పెంచుతుండగా, భారతీయులు సైతం నష్టపోయే ప్రమాదం ఉందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం అన్నారు. వైరా పట్టణ, కొణిజర్ల మండల పార్టీ సభ్యుల రాజకీయ శిక్షణా తరగతులను సోమవారం ఆయన వైరాలో ప్రారంభించి ప్రసంగించారు. ఇరాన్ అణ్వాయుధాలు తయారు చేస్తున్నట్లు ఆధారాలు లేవని అమెరికన్ ఇంటిలిజెన్స్ సంస్థలు, అంతర్జాతీయ అణుశక్తి సంస్థ ప్రకటించినా ట్రంప్ ఇజ్రాయిల్‌కు మద్దతుగా ట్రంప్ ఇరాన్‌పై దాడులు చేయించాడని ఆరోపించారు. ఇరాన్‌ను ధ్వంసం చేసి పశ్చిమాసియాను ఆక్రమించుకోవడం ద్వారా అంతర్జాతీయ చమురు వనరులను దోచుకుని ప్రపంచంపై పెత్తనం చెలాయించాలనేది అమెరికా లక్ష్యంగా తెలుస్తోందన్నారు. అయితే, ఈ దాడులను పలు దేశాలు ఖండించినా భారత ప్రధాని మోదీ స్పందించకపోవడం బీజేపీ ద్వంద్వ నీతికి అద్దం పడుతోందని పేర్కొన్నారు. ఇరాన్ హర్మూజ్ జల సంధిని మూసేయడంతో భారత్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగి నిత్యావసర వస్తువులపై ప్రభావం పడుతుందని వీరభద్రం పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, నాయకులు తాళ్లపల్లి కృష్ణ, మాచర్ల భారతి, బండి రమేష్, చింతనిప్పు చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఏదులాపురం.. ఎప్పుడూ అంతే

- పీఏసీఎస్‌పై ఆది నుంచి ఆరోపణలు
- అవినీతితో గత చైర్మన్ సస్పెండ్
- ప్రస్తుత చైర్మన్ రైతుల పేరిట రుణాలు తీసుకున్నాడనే ఆరోపణలతో విచారణ


ఏదులాపురం సొసైటీ కార్యాలయం

ఖమ్మంరూరల్: రూరల్ మండలంలోని ఏదులాపురం పీఏసీఎస్‌కు ఎంపికవుతున్న పాలకవర్గాల తీరుతో తరచుగా విమర్శలు వస్తున్నాయి. ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలు, మారుపేర్లతో రుణాల స్వాహా, రైతులకు రుణ మంజూరుకు పర్సంటేజీల వసూళ్లతో సొసైటీకి మచ్చలే మిగులుతున్నాయి. పాలకవర్గంలోని పలువురు 'నీకు ఇంత.. నాకు ఎంత' అన్న చందంగా వ్యవహరిస్తుండడంతో రైతులు ఇబ్బందిపడుతున్నారు. ప్రస్తుత చైర్మన్ సొసైటీ పరిధిలోని పలువురు రైతులను మచ్చిక చేసుకుని రుణాలు ఇప్పించి.. ఆపై వాటా తీసుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. గత చైర్మన్ హయాంలో ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలకు పాల్పడినట్లు ఫిర్యాదులు అందగా చైర్మన్‌తో పాటు సీఈఓపై సస్పెన్షన్ వేటు పడింది.

ప్రస్తుత చైర్మన్ నిర్వాకం

ఏదులాపురం సొసైటీ నుంచి తమ పేరుతో చైర్మన్ జర్పుల లక్ష్మణ్‌నాయక్ రుణాలు తీసుకున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్న విషయం విదితమే. రైతుల సంతకాలు తీసుకుని రుణాలు ఇప్పించినా, వారికి చెప్పిన దాని కంటే ఎక్కువ రుణం తీసుకున్నట్లు ఆలస్యంగా గుర్తించారు. అంతేకాక ఆ రుణం చెల్లించాల్సిన పని లేదని, మాఫీ అవుతుందని ఆయన నమ్మబలికినట్లు సమాచారం. కానీ మాఫీ కాకపోవడంతో బకాయిలు చెల్లించాలని సొసైటీ ఉద్యోగులు నోటీసులు జారీ చేస్తుండగా రైతులు ఆందోళనతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. కానీ తాము రూ.50వేల రుణమే తీసుకుంటే రూ.లక్ష రుణం అప్పుగా చూపిస్తుండడంతో ఎటూ పాలుపోని స్థితి ఎదుర్కొంటున్నామని వాపోయారు. సొసైటీ పరిధిలోని గుండాలతండా, గూడురుపాడు తదితర గ్రామాల రైతుల పేరిట దాదాపు రూ.50లక్షల మేర రుణాలను చైర్మన్ లక్ష్మణ్‌నాయక్ తీసుకున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో సొసైటీల అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఉషశ్రీని విచారణకు నియమించడంతో ఆమె వారం క్రితం సొసైటీకి వచ్చి రైతుల వద్ద స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. రైతుల పేరిట అందిన దరఖాస్తులు, వారికి మంజూరైన రుణం, అందులో ఎంత మేర చైర్మన్ తీసుకున్నాడనే వివరాలు సేకరించారు. ఆ తర్వాత విచారణలో పురోగతి లేకపోవడంతో చైర్మన్‌పై ఎలాంటి చర్యలు తీసుకుంటారో తేలలేదు. మరోపక్క బాకీ చెల్లించాలని సొసైటీ ఉద్యోగుల నుంచి నోటీసులు వస్తుండడంతో ఉన్నతాధికారులు త్వరగా నిర్ణయం తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిక..

సొసైటీ చైర్మన్ లక్ష్మణ్‌నాయక్‌పై వచ్చిన ఆరోపణల మేరకు విచారణ చేపట్టాం. ఫిర్యాదు చేసిన రైతుల నుంచి వివరాలు సేకరించి స్టేట్‌మెంట్ రికార్డు చేశాం. ఆపై పూర్తి వివరాలతో నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించాం. తదుపరి చర్యలపై ఆదేశాలు రావాల్సి ఉంది.

– ఉషశ్రీ, అసిస్టెంట్ రిజిస్ట్రార్

కార్మికవర్గాన్ని విస్మరిస్తే పతనం తథ్యం


సమావేశంలో మాట్లాడుతున్న చలమాల విఠల్‌రావు, పక్కన నాయకులు

సత్తుపల్లిరూరల్: కార్మిక వర్గాల సంక్షేమాన్ని విస్మరిస్తే ప్రభుత్వ పతనం తప్పదని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి చలమాల విఠల్‌రావు పేర్కొన్నారు. వచ్చేనెల 9న జరనున్న సార్వత్రిక సమ్మె విజయవంతానికి సత్తుపల్లిలో సోమవారం నిర్వహించిన సమావేశంలోసాయన మాట్లాడారు. కార్మిక, కర్షక, విద్యార్థి, నిరుద్యోగులతో పాటు కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్రప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఈమేరకు ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈసమావేశంలో నాయకులు కొలికపోగు సర్వేశ్వరరావు, మోరంపూడి పాండురంగారావు, మట్టపర్తి సత్యనారాయణ, ఎలగం కృష్ణ, శ్రీనివాసరావు, సైదా, యాకోబు, మస్తాన్, రవి, రాము, సత్యనారాయణ, భాస్కర్, రమేష్, సురేష్ పాల్గొన్నారు.

కోల్డ్ స్టోరేజ్‌ల్లోనే మిర్చి అమ్ముకుంటాం..


రాస్తారోకోలో పాల్గొన్న నాయకులు, రైతులు

తల్లాడ: మార్కెట్‌లోనే మిర్చి విక్రయించాలని రైతులపై ఒత్తిడి తీసుకురావడం సరికాదని పలువురు పేర్కొన్నారు. ఈమేరకు భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యాన మండలంలోని అన్నారుగూడెం కోల్డ్‌స్టోరేజీల వద్ద మంగళవారం జరిగిన రాస్తారోకోలో పలువురు రైతులు పాల్గొన్నారు. ఈసందర్భంగా సంఘ్ రాష్ట్ర కార్యదర్శి మందరపు రామారావు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు కోల్డ్ స్టోరేజ్‌లో మిర్చి అమ్మితే రూ.లక్షకు రూ.1.50 కమీషన్ తీసుకొని నగదు చెల్లిస్తున్నారని తెలిపారు. అదే వైరా మార్కెట్‌కు వెళ్తే శాంపిళ్లు తీసుకెళ్లాక నచ్చితే మరుసటి రోజు తీసుకురావాలని సూచిస్తుండగా, లక్షకు రూ.3 నుంచి రూ.5 కమీషన్ తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ఈమేరకు రైతులు కోల్డ్ స్టోరేజీల్లో అమ్ముకునే అవకాశం కల్పించాలని, మార్కెట్ యార్డ్ నుంచి కోల్డ్ స్టోరేజీలకు పంపిన నోటీసులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, రాస్తారోకోతో పెద్దసంఖ్యలో వాహనాలు నిలిచిపోగా పోలీసులు నచ్చచెప్పి విరమింపజేశారు. ఆతర్వాత అనుమతి లేకుండా రాస్తారోకో చేయడంపై నాయకులు మందరపు రామారావు, ప్రగడవరపు శ్రీనివాసరావుతో పాటు కట్టా ఖాదర్ బాబా, బండారు సత్యనారాయణ, కొండపల్లి నరేష్‌పై తదితరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు.